క్లుప్తంగా

డివైడర్ ఢీకొని.. ఒకరి మృతి



రొంపిచర్ల: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన అద్దంకి–నార్కెట్‌పల్లి రహదారిపై సుబ్బయ్యపాలెం జంక్షన్ వద్ద గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాదు నుంచి ఒంగోలు వెళుతున్న కియా కారు ముందుగా వెళుతున్న లారీని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో కారును నడుపుతున్న కోసూరు నాగేశ్వరరావు (47) అక్కడికక్కడే మృతిచెందగా మరో ముగ్గురు వ్యక్తులు గుంటూరులో చికిత్స పొందుతున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు దాటుతూ మరొకరు!

నరసరావుపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన చిలకలూరిపేటరోడ్డులో చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఇస్లాంపేటకు చెందిన షేక్ మస్తాన్‌వలి (45) వంటమాస్టర్‌గా పని చేస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున చిలకలూరిపేట రోడ్డులోని గంటా లలితాదేవి కాలనీ వద్ద రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మస్తాన్‌వలిని 108 వాహనం ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ట

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీ సంతాన వేణుగోపాల స్వామి విగ్రహం, శిఖర, జీవ ధ్వజ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం నుంచి గురువారం వరకు అత్యంత వైభవంగా కనుల పండుగగా జరిగింది. మహోత్సవాన్ని పురస్కరించుకొనిస్థానిక శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు.

11న ప్రవేశ పరీక్ష

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఈనెల 11న నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ పద్మావతి గురువారం తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికిగాను 6వ తరగతిలో విద్యార్థులను చేర్చుకునేందుకు 11వ తేదీ ఆదివారం ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తున్నామని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు అందరూ తప్పకుండా హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

మున్సిపల్ టీపీఎస్ బదిలీ

నరసరావుపేట: పురపాలకశాఖలో గత నాలుగేళ్లుగా టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న టి.అనూరాధ పిడుగురాళ్ల పురపాలకశాఖకు బదిలీ అయ్యారు. ఈ మేరకు టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ ఆర్‌జే విద్యుల్లత ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో పిడుగురాళ్లకు చెందిన టీపీఎస్ కేవీ సత్యనారాయణను నరసరావుపేట పురపాలకసంఘ టీపీఎస్‌గా నియమించారు.

పాట్లూరులో 'ఫ్యామిలీ డాక్టర్'

శావల్యాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన వైద్యసేవలు పారదర్శకంగా అందించటానికి ఫ్యామిలీ వైద్యాధికారి కార్యక్రమం దోహదపడుతుందని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం అన్నారు. గురువారం మండలంలోని పాట్లూరు గ్రామంలో ఫ్యామిలీ వైద్యాధికారి కార్యక్రమం వైద్య ఆరోగ్య నిర్వహించారు. ఆయనతో పాటు ఎంఎల్‌హెచ్‌పి శిరీషా, ఆరోగ్య కార్యకర్త విజయలక్ష్మి పాల్గొన్నారు.

చెరువుల పరిశీలన

నరసరావుపేట రూరల్: అమృత్ సరోవర్‌లో భాగంగా జిల్లాలో జరుగుతున్న చెరువుల ఆధునీకరణ పనులను సీఆర్‌డీఏ బృందం గురువారం పరిశీలించింది. మండలంలోని లింగంగుంట్ల, ఇస్సప్పాలెం గ్రామాల్లోని చెరువులను బృందం సభ్యులు గౌరిశంకర్, రాజేష్ పరిశీలించారు. చెరువుల సుందరీకరణపై గ్రామస్తులు, డ్వామా సిబ్బందితో మాట్లాడారు. లింగంగుంట్ల మాజీ సర్పంచ్ పొన్నపాటి విజయకృష్ణారెడ్డి, డ్వామా సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త

నాదెండ్ల: సైబర్ నేరాల పట్ల ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించేందుకు పోలీసులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నరసరావుపేట డీఎస్పీ మహేష్ చెప్పారు. నాదెండ్ల పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. క్రైం రికార్డులు తనిఖీ చేశారు. ఆయనతో పాటూ చిలకలూరిపేట రూరల్ సీఐ వై.అచ్చయ్య, ఎస్సై ఎ.భాస్కర్ ఉన్నారు.

పురోగతి పెంచాలి

శావల్యాపురం: వైఎస్సార్ బీమా యోజన పురోగతి వేగవంతం చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పథకం పురోగతిపై సచివాలయ ఉద్యోగులతో సమీక్షించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీలలో 10 వేల 281 మంది రైస్‌కార్డుదారులు అర్హత కలిగిన లబ్ధిదారులు ఉండగా 4577 మంది లబ్ధిదారుల వివరాలు మాత్రమే నమోదు చేశారన్నారు.

జగనన్న మాట నిలబెట్టుకున్నారు

- జీపీఎస్ అమలుపై ప్రభుత్వోద్యోగుల్లో హర్షం
- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్: సీపీఎస్ రద్దుపై పాదయాత్రలో ఉద్యోగులకు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నా రని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఉద్యోగులకు ఎలాంటి నష్టం జరగకుండా సీపీఎస్ స్థానంలో జీపీఎస్ అమలు చేయాలని క్యాబినెట్ తీర్మానం చేయడం పట్ల ప్రభుత్వ ఉద్యోగులు హర్షిస్తున్నారని తెలిపారు. గుంటూరు రోడ్డు లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడారు. ఎన్నికల సమయంలో సీపీఎస్ రద్దు చేస్తానని ముఖ్యమంత్రి హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో సీపీఎస్ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రస్తుతం ఉద్యోగస్తులకు లభిస్తున్న పెన్షన్ విధానంలో మార్పులు చేస్తూ జీపీఎస్‌ను తీసుకువచ్చా రని పేర్కొన్నారు. ఉద్యో గ విరమణ తరువాత బేసిక్ పేలో 50 శాతం పెన్షన్‌గా లభిస్తుందన్నారు. అలాగే ప్రతీ ఆరు నెలలకు డీఏలు, 12వ పే రివిజన్‌ను జీపీఎస్‌లో అమ లు చేస్తారని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల ప్రభుత్వ ఉద్యోగుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని జీపీఎస్‌ను తీసుకువచ్చినట్టు తెలిపారు. ఉద్యోగులు కోరిన విధంగా పాత పెన్షన్ విధానం అమలు చేస్తు ప్రభుత్వానికి ఎటువంటి భారం ఉండదన్నారు. 2040 నుంచి అమలయ్యే ఈ విధానం వలన అప్పటి ప్రభుత్వానికి భారం కాకుడదనే జీపీఎస్‌ను తీసుకు వచ్చారని వివరించారు. జీపీఎస్ వలన ప్రభుత్వానికి భారం ఉండదని, ఉద్యోగస్తులకు నష్టం కలగదని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం 98.4 శాతం హామీలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. సీపీఎస్ రద్దుతో 99 శాతం హామీలను నేరవేర్చినట్టయిందన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోను అమలు చేయడంలో సీఎం జగన్ 100కి 99 మార్కులు పొందారని తెలిపారు. 2014 ఎన్నికల్లో 640 హామీలు ఇచ్చి 10 శాతం హామీలు కూడా చంద్రబాబు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ప్రస్తుతం చంద్రబాబు చెబుతున్న మ్యానిఫెస్టోను ప్రజలు నమ్మరని, మరోసారి మోసపోవడానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యూలర్ చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీని సీఎం జగన్ నిలబెట్టుకున్నారని, 10 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసిందన్నారు. దీంతో పాటు 6845 పోస్టుల భర్తీకి కూడా క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం పట్ల నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

పేదరికం లేని రాష్ట్రమే సీఎం లక్ష్యం



ఉప్పరపాలెంలో గడపగడపకు కార్యక్రమంలో మంత్రి రజిని

గడపగడపకూ జగనన్న ఆశయాలు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- ఉత్సాహంగా రెండోరోజు గడపగడపకు కార్యక్రమం
- ఉప్పరపాలెంలో ఇంటింటినీ సందర్శించిన మంత్రి రజిని

యడ్లపాడు: భావితరాలకు ఉజ్వల భవిష్యత్తు..పేద కుటుంబాలకు మేలు జరగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని కోరారు. మండలంలోని ఉప్పరపాలెం గ్రామంలో గురువారం రెండో రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి హాజరయ్యారు. మంత్రితో పాటు పార్టీ శ్రేణులు అదే ఉత్సాహంతో ఇంటింటికీ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. జగనన్న ప్రభుత్వంలో గ్రామంలోని ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరినదీ మహిళలకు వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధితో పాటు స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ పేదరికం లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే లక్ష్యంగా చేసుకుని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకమైన పాలన సాగిస్తున్నారని తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా నవరత్న సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు.

ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే అందించేందుకు ముఖ్యమంత్రి జగనన్న గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారన్నారు. టీడీపీకి ఓటు వేసిన పచ్చ నాయకుల ఇళ్లకు సైతం ఎక్కడా వివక్ష చూపలేదన్నారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా నేరుగా రూ.2.10 లక్షల కోట్లు వారి వ్యక్తిగత ఖాతాలకు చేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. జగనన్న ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా అమలు చేస్తున్న ఆయా పథకాలతో పేదలు ఆర్థిక అభివృద్ధిని సాధిస్తున్నారని పేర్కొన్నారు. సీఎం జగన్‌కు లభిస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష నాయకులు తప్పుడు ప్రచారాలకు తెరతీశారని ఆరోపించారు. ఒంటరిగా పోటీ చేసేధైర్యంలేక పొత్తులు పెట్టుకోవడం ఆపార్టీ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. మీ సంక్షేమం.. మీ బిడ్డల భవిష్యత్ కోసం పెద్దపీట వేసే ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గంటా శంకర్, సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారావు, పార్టీ నాయకులు షేక్ ఖాదర్‌బాషా, అల్లాబక్షు, ఆలోకం వెంకట లక్ష్మినారాయణ, పావులూరి వాసు, వి.శ్రీనివాసనాయక్, షేక్ ముజాఫా, హుస్సేన్, బుజ్జి, చాగంటి శ్రీధర్, ఉప్పారపాలెం నాయకులు పల్లపు లక్ష్మినారాయణ, గ్రామపార్టీ అధ్యక్షుడు పల్లపు రవి, పల్లపు మునలయ్య, అంకమ్మబాబు, వల్లెపు చక్రవర్తి, పల్లపు మంగయ్య, పానకాల మంగయ్య, అచ్చి శ్రీను, విప్పర్ల దేవసహాయం, కర్రా ప్రభాకరరావు, మెడబలిమి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంతానం లేని వారికి చక్కని పరిష్కారం 'ఏషియన్ ఐవీఎఫ్'

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్లు వంశీనాథరెడ్డి, త్రివేణి కొండారెడ్డి

నరసరావుపేట: పలు రకాల కారణాలతో పిల్లలు లేని తల్లిదండ్రులు ఐవీఎఫ్ విధానంలో పిల్లలు కావాలనుకునే వారికి ఏషియన్ హాస్పిటల్స్ ఐవీఎఫ్ (ఇన్ విట్రో ఫర్టిలైజేషన్)సెంటర్ చక్కని పరిష్కారం చూపుతుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం వినుకొండరోడ్డు ఆంజనేయస్వామి దేవాలయ సమీపంలోని ఏషియన్ హాస్పిటల్స్‌లో డాక్టర్ త్రివేణి కొండారెడ్డి సారథ్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఏషియన్ ఐవీఎఫ్ సెంటర్‌ను రిబ్బన్ కట్‌చేసి ఘనంగా ప్రారంభించారు. పల్నాడుజిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో ఐవీఎఫ్ సెంటరు ప్రారంభించడం గొప్ప పరిణామం అన్నారు. పిల్లలకోసం గర్భిణీ పొందేందుకు గుంటూరు, విజయవాడ, హైదరాబాదు లాంటి ఇతర ప్రాంతాలకు వెళ్లే పని లేకుండా ఇక్కడే అత్యాధునిక సౌకర్యాలతో చికిత్సలు చేసి పిల్లల కలిగే విధంగా చేయగలరని తెలిపారు. వివిధ ప్రత్యేకతలతో ఏర్పడుతున్న హాస్పిటళ్లతో జిల్లా కేంద్రమైన నరసరావుపేట వైద్య హబ్‌గా రూపుదిద్దుకుంటుందన్నారు. ఇప్పటికే నరసరావుపేట, ప్రకాశం జిల్లాలోని కొంతభాగ ప్రజలు వైద్య సేవలకోసం నరసరావుపేటకు వస్తున్నారన్నారు. పరిసర ప్రాంత ప్రజలందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు, అతి తక్కువ ఖర్చుతో అత్యాధునిక వైద్య సేవలు పేదలకు అందించాలని డాక్టర్ పి.వంశీనాథరెడ్డి, డాక్టర్ త్రివేణీలకు ఎమ్మెల్యే సూచించారు. వైద్యశాలలోని వివిధ విభాగాలను పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథార్టీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, కేర్ పబ్లిక్‌స్కూలు అధినేత కేసరి కోటిరెడ్డి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఎంపీపీ మోరబోయినశ్రీనివాసరావు, ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ ఏఏవీ రామలింగారెడ్డి . రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కె.జే. మోహన్ రెడ్డి, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, డాక్టర్ కారసాని శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సూర ప్రదీప్ కుమార్‌రెడ్డి, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, న్యాయవాది కేసరి శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పలపాడు గ్రామ నాయకులు కనక పుల్లారెడి పాల్గొన్నారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

నాదెండ్ల: భవిష్యత్‌లో గణపవరం గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా అవతరించబోతోందని ఆదిపరాశక్తి క్షేత్రం పీఠాధిపతి నిత్య విద్యానంద భారతీ స్వామి చెప్పారు. గణపవరం–చిలకలూరిపేట రోడ్డులోని శివప్రియనగర్‌లో ఆదిపరాశక్తి క్షేత్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 10–16 వరకూ శ్రీ గండి పోచమ్మ అమ్మవారి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు, చండీయాగ సహిత కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 10న కలశాభిషేకం, 11న అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు, 12న చండీయాగ సహిత కుంభాభిషేకాలు, 15న అమ్మవారి పల్లకీ సేవ ఊరేగింపు, గ్రామోత్సవం, జాతర జరుగుతుందన్నారు. 16న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మహా అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. చివరిరోజు అమ్మవారి ఆవాహనం, మహిళలకు సారె అందిస్తామన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో హిందూ సనాతన ధర్మాన్ని పరిరక్షించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆదిమూలం గ్రామ దేవతలేనని, సమస్త భూమండలంలో సకల దేవతల కలయికే ఆదిపరాశక్తి అమ్మవారని పేర్కొన్నారు. బిక్షాటన మహాయజ్ఞం ద్వారా ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు.

ఆలయ జీర్ణోద్ధరణకు శంకుస్థాపన

రూ.40 లక్షలు మంజూరు చేసిన ప్రభుత్వం



ఆలయ జీర్ణోద్ధరణకు శంఖుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి.

నరసరావుపేట ఈస్ట్: కోట సెంటర్ పులుపుల వారి వీధిలో వేంచేసియున్న ప్రాచీన వీరాంజనేయ స్వామి సహిత శ్రీయోగానంద లక్ష్మీనరసింహ స్వామి వారి నూతన ఆలయ నిర్మాణపు పనులకు గురువారం శంకుస్థాపన నిర్వహించారు. దాదాపు రెండు శతాబ్దాల క్రితం నిర్మించిన ఆలయ ఆవరణలోని శ్రీవీరాంజనేయస్వామి వారికి, శ్రీయోగానంద లక్ష్మీనరసింహ స్వామివారికి రాతి కట్టడాలతో నూతన ఆలయాలను నిర్మించనున్నారు. దీనిలో భాగంగా ఈఏడాది ఫిబ్రవరిలో బాలాలయాన్ని నిర్మించి మార్చి నెలలో స్వామివార్లను ప్రాణప్రతిష్ట చేసి నిత్య కైంకర్యాలు నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో నూతన ఆలయాల నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శంకు ప్రతిష్ట గావించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ, ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. ఆలయ కమిటీ పెద్దలు, దాతలు, భక్తులు 33 శాతం నిధులను సమకూర్చటంతో మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్‌బాబు, జేఎన్‌టీయూకే పాలకమండలి సభ్యులు మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, శ్రీవాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, చలువాది బ్రహ్మయ్య, ఆలయ జీర్ణోద్ధరణ కమిటీ అధ్యక్షుడు వనమా కృష్ణ, కార్యదర్శి దేసు రజనీకుమార్, కోశాధికారి గజవల్లి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్

ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మెడికల్ ఉద్యోగుల ఆనందం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

రొంపిచర్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం థ్యాంక్యూ సీఎం కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో కాంట్రాక్ట్ పారా మెడికల్ ఉద్యోగులు తమను రెగ్యులర్ చేసినందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో గత 20 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పారా మెడికల్ ఉద్యోగులుగా పని చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ముఖ్యమంత్రులుగా పని చేసిన వారు తమను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి తప్పారన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు నిర్వహించిన పాదయాత్రలో తమను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి క్యాబినెట్ సమావేశంలో రెగ్యులర్ చేసి మాట నిలబెట్టుకున్నారన్నారు. తాము జీవితాంతంవై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని పేర్కొన్నారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు కిరణ్ కుమార్, సురేష్, రాము, కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి



రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డిని సత్కరిస్తున్న యూనియన్ నాయకులు

నరసరావుపేట: ప్రాథమిక సహకార పరపతి సంఘ ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని సంఘ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డిని కోరారు. ఈమేరకు తాడేపల్లిలో గురువారం ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. 2019 నుంచి వేతన బకాయిలు చెల్లించాలని, డీసీసీబీ ఉద్యోగుల మాదిరిగానే పీఏసీఎస్ ఉద్యోగులకు కూడా సమాన డీఏ చెల్లించాలని, ఇప్పటివరకు ఉన్న గ్రాట్యుటీని రూ.2 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాలని, పదవీ విరమణ వయస్సును 62ఏళ్లకు పెంచాలని కోరారు. కలిసిన వారిలో యూనియన్ అధ్యక్షుడు పొలిమేర వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ముప్వా వెంకటేశ్వరరావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఈపూరులో పలువురు అధికారులు బదిలీ

ఈపూరు: మండలంలో పలువురు అధికారులు బదిలీ అయ్యారు. బదిలీలో భాగంగా గిద్దలూరు ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న రంగనాయకులు ఈపూరు ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా వ్యవహరిస్తున్న బొల్లాపల్లి మండల ఏవో ఉషాకిరణ్ యథాస్థానానికి వెళ్లనున్నారు. ఈపూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈగా పనిచేస్తున్న రఫీ నరసరావుపేటకు బదిలీ అయ్యారు. నరసరావుపేటలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావుకు ఈపూరు ఏఈగా బదిలీపై వచ్చారు. వీరిరువురు శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. అలాగే మండల డిప్యూటీ సర్వేయర్ చండీరాణి నూజెండ్ల సర్వేయర్‌గా బదిలీ అయ్యారు. శావల్యాపురం మండల డిప్యూటీ సర్వేయర్ తుంగా శ్రీనివాసరావు బదిలీపై పదోన్నతి పొంది ఈపూరు మండల సర్వేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. అలాగే ఈపూరు ఎస్‌ఐ వెంకట్రావు పెదకూరపాడు బదిలీ అయ్యారు. ఈపూరు ఇన్‌చార్జి ఎస్‌ఐగా బొల్లాపల్లి ఎస్‌ఐ బలరాంరెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

నీటి సరఫరా సమస్యలపై తక్షణ చర్యలు



పైపులైన్ మరమ్మతులపై అధికారులకు సూచనలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట: మంచినీటి సరఫరాకు సంబంధించి సమస్యలపై తక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని సూచించారు. పట్టణంలోని రూత్ డైక్‌మెన్ కాలనీలో మంచినీటి సమస్యలను అధికారులతో కలసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పైపులైన్ లీకులను గుర్తించి వెంటనే మరమ్మతు పనులు నిర్వహింపచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది మంచినీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డీఈఈ తోట వెంకట రమణ, ఏఈఈ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త పైపులైన్ ఏర్పాటు కారణంగా...

పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లోని గాంధీపార్కు రోడ్డులో తరచు లీకులు ఏర్పడుతున్న కారణంగా రూ.13 లక్షలతో కొత్త పైపులైన్ వేయడం జరుగుతుందన్నారు. దీని కారణంగా పట్టణంలోని తాషాబజారు, ఇస్లాంపేట, బాబుగారితోట, వడ్డెరపాలెం, రాగన్నపాలెం, గుండయ్యతోట, సుభానినగర్, పొన్నంవారివీధి, బ్రిట్రావారి బజారు, బొందిలిపాలెం ప్రాంతాల్లో ఈ నెల 12,13 తేదీలలో మంచినీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని చైర్మన్ రఫాని తెలిపారు. ఈ నేపథ్యంలో 11వ తేదీ వరకు సంబంధిత ప్రాంతాల ప్రజలు మంచినీటిని అదనంగా పట్టుకొని నిల్వ చేసుకోవాలని సూచించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం



వినుకొండ టౌన్: భర్త, అత్తమామల వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన సంఘటన గురువారం పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ సాంబశివరావు కథనం ప్రకారం.. పట్టణంలోని రైలుపేటలో నివాసం ఉంటున్న జూనియర్ న్యాయవాది సయ్యద్ ఖాసింకు మెదటి భార్యతో విడాకులు తీసుకోగా, అదే ప్రాంతానికి చెందిన రజియాతో 16 నెలల క్రితం పెద్దల సమక్షంలో రెండవ వివాహం జరిగిందన్నారు. కొత్తలో భర్త, అత్తమామలు తనను ఆప్యాయంగా చూసుకోవడం జరిగిందని, కొంత కాలం తరువాత తనను పుట్టింటికి సైతం వెళ్లనీయకుండా చేసినట్లు ప్రవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితురాలు ఫిర్యాదు చేసిందన్నారు. కాలక్రమంలో బాధితురాలు గర్భం దాల్చగా కొంతకాలం ఆప్యాయంగా చూసుకోగా మరలా అబార్షన్ జరిగే విధంగా తనకు తెలియకుండా మందులు వాడించా రని పేర్కొందని వివరించారు. ఇటీవల తన బంధువు చనిపోతే పుట్టింటికి వెళ్లగా తిరిగి మళ్లీ అత్తింటికి రానియ్యకుండా విడాకులు ఇచ్చేందుకు సిద్ధమయ్యా రని బాధితురాలు పోలీసులకు వివరించింది. తన భర్త తనకు కావాలంటూ కోర్టులో పిటీషన్ వేయగా మరింత వేధింపులు అత్తింటి నుంచి ఎదురుకావడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. కాగా బాధితురాలు తెలిపిన వివరాల మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆయన వెంట పట్టణ ఎస్‌ఐ రాజ్యలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

రొంపిచర్ల ఉపసర్పంచ్‌గా నాగేశ్వరరావు

రొంపిచర్ల: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. ఇప్పటివరకు గ్రామ ఉపసర్పంచ్‌గా పనిచేసిన 12వవార్డు మెంబర్ గెల్లి పున్నారెడ్డి అనారోగ్య కారణంగా తన పదవికి రాజీనామా చేయటంతో నూతన ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించాల్సివచ్చింది. ఎన్నికల అధికారిగా ఈవోపీఆర్డీ కె.విజయరాము వ్యవహరించారు. గ్రామ ఉపసర్పంచ్‌గా 13వవార్డు మెంబర్ కొమ్ము నాగేశ్వరరావును వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు ఉపసర్పంచ్‌గా కొమ్ము నాగేశ్వరరావుచే ప్రమాణ స్వీకారం చేయించినారు. ఎన్నికైన నాగేశ్వరరావును ఘనంగా సన్మానించారు.

నాణ్యత విషయంలో రాజీపడొద్దు!



పనులు పరిశీలిస్తున్న నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల: నాణ్యత విషయంలో రాజీ పడవద్దని గోల్కొండ గ్రూపు చైర్మన్ నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం రూ.70 లక్షల తన స్వంత నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. 2021లో ఈ పాఠశాలను కేంద్రం బృందం పరిశీలించిన సమయంలో మౌలిక వసతులను చూసి ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేయటం జరిగిందన్నారు. అప్పటి నుంచి పాఠశాలలో విద్యార్థులకు కావల్సిన అన్ని వసతులతో పాటూ తన స్వంత నిధులతో విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఇతర పలు విద్యా సామగ్రి అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 72 మందికి గాను 71 మంది విద్యార్థులు ఉత్తీర్ణులవ్వటం సంతోషకరమన్నారు.